సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 9 । డిసెంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు నడింపల్లి వెంకట రామరాజు దంపతులు (భీమవరం) రూ.1,01,116 విరాళం అందజేశారు.



అభయహస్తం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.4 లక్షల విలువైన అభయహస్తాన్ని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ చేతులమీదుగా భక్తులు సమర్పించారు.

దీపోత్సవం.. దేదీప్యమానం



యలమంచిలి: స్థానిక కేశవస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. శంఖు, చక్ర, నామాల ఆకృతిలో దీపాలు వెలిగించారు.

న్యూస్‌రీల్

12న గవర్నర్ రాక



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్

దెందులూరు : వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 12న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఏలూరు జిల్లాకు రానున్నారని జిల్లా పంచాయతీ అధికారి, దెందులూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గవర్నర్ కార్యక్రమానికి దెందులూరు మండలం గాలాయగూడెం పంచాయతీ వేదికగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై స్టాల్స్‌ను ఏర్పాటుచేయాలని, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని, డ్రోన్ ప్రదర్శన, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. వివిధ శాఖల వారీగా పని విభజన, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ అప్పారావు, ఇరిగేషన్ డీఈ రాజేంద్రన్, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎంపీడీఓ భీమరాజు, ఏపీఎం వేణుగోపాల్, మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ పాల్గొన్నారు.

యనమదుర్రు కరకట్ట పటిష్టం



పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ వినోద్ చందు

భీమవరం అర్బన్: తుపాను ప్రభావంతో ఎగువన ఎర్రకాలువ ఉప్పొంగడంతో యనమదుర్రు డ్రెయిన్ కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మట్టి సంచులతో పటిష్టం చేస్తున్నామని ఇరిగేషన్ డీఈ వినోద్ చందు తెలిపారు. మండలంలోని గూట్లపాడు రేవు వద్ద శుక్రవారం యనమదుర్రు డ్రెయిన్ కరకట్ట వద్ద మట్టి బస్తాలతో పూడ్చటాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటికే యనమదుర్రు డ్రెయిన్‌కు ఎగువన ఉన్న ఎర్రకాలువకు వరద నీరు భారీగా చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారని, దీంతో కరకట్ట బలహీనంగా ఉన్న చోట పటిష్టపరుస్తున్నామన్నారు. సంచుల్లో మట్టిని నింపి తరలించేందుకు సిద్ధంగా ఉంచామన్నారు. ఎక్కడైనా డ్రెయిన్ గట్టు బలహీనంగా ఉంటే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. టీవీ సత్యనారాయణ, రైతులు వారి వెంట ఉన్నారు.

సీపెట్‌లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పాలకొల్లు సెంట్రల్: విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, సీఐపీఈటీ (సీపెట్) ఆధ్వర్యంలో ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీపెట్ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శుక్రవారం తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ సౌజన్యంతో 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల వయసున్న నిరుద్యోగులు అర్హులన్నారు. పోలిమర్స్ టెక్నాలజీలో మెషిన్ ఆపరేటర్ అసిస్టెంట్, ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణ ఇస్తామన్నారు. అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూరు, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్స్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామని, అలాగే ట్రైనింగ్ కిట్స్, యూనిఫామ్, సేఫ్టీ షూస్ అందిస్తామన్నారు. అభ్యర్థులు విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో సీపెట్ ప్రతినిధి కె.సుందరరావు, 9398050255 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీఎంఓ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమగ్ర శిక్ష ఏలూరు జిల్లా కార్యాలయంలో ఖాళీగా ఉన్న కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్ హైస్కూళ్లలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, డైట్ లెక్చరర్లు, స్కూల్ అసిస్టెంట్లు అర్హులని పేర్కొన్నారు. అర్హత గలవారు ఈనెల 15న సాయంత్రం 5 గంటలలోపు ఏలూరులో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఆలయాలకు మహర్దశ

అభివృద్ధికి నైవేద్యం

- జిల్లాలో 36 ఆలయాల పునర్నిర్మాణం
- రూ.20.95 కోట్ల నిధుల మంజూరు
- ఫేజ్–2లో మరో 6 ఆలయాల నిర్మాణానికి చర్యలు
- ఆలయాల జీర్ణోద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యం



వీరవాసరం మండలం నవుడూరులో నిర్మాణంలో ఉన్న రామలింగేశ్వరస్వామి దేవస్థానం

భీమవరం (ప్రకాశంచౌక్): దేవదాయశాఖకు చెందిన పురాతన ఆలయాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం దేవస్థానాల జీర్ణోద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టింది. దెబ్బతిన్న ఆలయాలు, వాటి ప్రాంగణాలు, పరిసరాలను పునర్నిర్మింపజేసి ఆలయాలకు పూర్వ వైభోగం తీసుకురావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసి నూతన ఆలయాలను నిర్మించే దైవ కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా జిల్లాలో ఆలయాల పునః నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. దేవస్థాన ధర్మకర్తల మండలి, ఆలయ అధికారులు ఆలయాల్లో పనులు వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా ఆలయాలు నిర్మాణం చేసే తాపీమేస్త్రీలను తీసుకువచ్చి నిర్మాణ పనులు చేయిస్తున్నారు.

సీజీఎఫ్ గ్రాంట్ నుంచి..

పునః నిర్మాణం చేస్తున్న ఆలయాలకు ప్రభుత్వం సీజీఎఫ్ గ్రాంట్ (కామన్ గుడ్ ఫండ్) నుంచి నిధులు మంజూరు చేసింది. ఆలయాల నిర్మాణానికి అయ్యే ఖర్చులో 67 శాతం నిధులు ప్రభుత్వం అందించగా 33 శాతం మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ దేవస్థానం తరఫున ఖర్చు చేయనున్నారు. ఆదాయం తక్కువగా ఉన్న కొన్ని ఆలయాలకు మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ నిధులకు దాతలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ప్రభుత్వం సీజీఎఫ్ గ్రాంట్ నుంచి ఆలయాల నిర్మాణానికి రూ.13 లక్షల నుంచి అధికంగా రూ.1.50 కోట్ల వరకు నిధులు మంజూరు చేశారు.



భీమవరంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామలింగేశ్వరస్వామి ఆలయం

రూ.28.97 కోట్లతో..

జిల్లాలో రూ.28.97 కోట్లతో 36 ఆలయాలను పునః నిర్మాణం చేస్తున్నారు. ఈ ఆలయాలకు ప్రభుత్వం సీజీఎఫ్ గ్రాంట్ రూ.20.95 కోట్లు మంజూరు చేసింది. మ్యాచింగ్ కంట్రిబ్యూషన్‌గా రూ.8.02 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

చురుగ్గా నిర్మాణాలు



జిల్లాలో 36 దేవస్థానాల పునః నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. సీజీఎఫ్ గ్రాంట్, మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ నిధులతో ఈ ఆలయాల నిర్మాణం చేపట్టాం. వేగంగా నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే ఫేజ్–2లో జిల్లాలో మరో 6 దేవస్థానాలను పునః నిర్మాణం చేయాలని ప్రతిపాదించి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపాం.

– ఈవీ సుబ్బారావు, జిల్లా దేవదాయశాఖ అధికారి

ఆలయాలకు నిధుల మంజూరు

ఆలయం	ప్రాంతం	నిధులు రూ.లక్షల్లో
సీతారామలింగేశ్వరస్వామి దేవస్థానం	భీమవరం	66.66
పాలేశ్వరస్వామి దేవస్థానం	ఇరగవరం	21.66
శివ కేశవస్వామి దేవస్థానం	కొమరాడ	66.66
కనకదుర్గమ్మ దేవస్థానం	బి.కొండేపాడు	44.66
సోమేశ్వరస్వామి దేవస్థానం	ఎల్‌బీచర్ల	44.66
చెన్నమల్లేశ్వరస్వామి దేవస్థానం	చెరుకువాడ	60.00
వేణుగోపాలస్వామి దేవస్థానం	చెరుకువాడ	60.00
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	జక్కరం	66.66
కోదండ రామాలయం	చిలుకూరు	90.00
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	నవుడూరు	60.00
ముత్యాలమ్మ దేవస్థానం	ముత్యాలంబపురం	66.66
రామేశ్వరస్వామి దేవస్థానం	వెలగలేరు	100.00
సోమేశ్వరస్వామి దేవస్థానం	కవిటం	18.00
గోపాల ఆంజనేయస్వామి దేవస్థానం	కె.పెంటపాడు	80.00
ముత్యాలమ్మ దేవస్థానం	ఆకుతీగపాడు	13.33
గౌరీదేవి దేవస్థానం	పెంటపాడు	66.66
విశ్వేశ్వరస్వామి దేవస్థానం	వల్లూరుపల్లి	150.00
రామాలయం	దర్శిపర్రు	46.66
లక్ష్మీ నర్సింహస్వామి దేవస్థానం	రేలంగి	53.33
మదనగోపాలస్వామి దేవస్థానం	కొయ్యేటిపాడు	46.66
అలుసులమ్మ దేవస్థానం	కృష్ణాపురం	40.00
కోదండరామస్వామి దేవస్థానం	రామారావుపేట	66.00
గణపతి సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం	కడియద్ద	66.00
దేశాలమ్మ దేవస్థానం	కుంచనపల్లి	33.34
వేంకటేశ్వరస్వామి దేవస్థానం	తాడేపల్లిగూడెం	58.50
రామాలయం	పడమర విప్పర్రు	33.33
వేణుగోపాలస్వామి దేవస్థానం	దువ్వ	13.30
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	శ్రీరాంపురం	100.00
అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం	వడలి	135.00
రామలింగేశ్వరస్వామి దేవస్థానం	కోపల్లె	100.00
బాల వేంకటేశ్వరస్వామి దేవస్థానం	పెంటపాడు	54.00
జనార్దన స్వామి దేవస్థానం	తూర్పువిప్పర్రు	8.00
కోదండరామస్వామి దేవస్థానం	తాడేపల్లిగూడెం	5.00
తాండవేశ్వరస్వామి దేవస్థానం	ఆరేడు	55.86
కేశవస్వామి దేవస్థానం	ఆరేడు	45.22

వేగంగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



సభ, హెలీప్యాడ్ ప్రాంతాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం స్థానిక బైపాస్ రోడ్డులోని గ్రంధి వెంకటేశ్వరరావు ప్రభుత్వ జూనియర్ కాలేజీ వెనుక లేఅవుట్‌లో సభావేదిక, లూథరన్ హైస్కూల్ గ్రౌండ్‌లో హెలీప్యాడ్ ప్రాంతాలను వారు పరిశీలించారు. సభ జరిగే ప్రాంతంలో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సభకు జనం వచ్చే మార్గాలను, వాహనాలు నిలుపుదల చేసే ప్రాంతాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ భీమవరం బహిరంగ సభలో పాల్గొని విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం నిధులు విడుదల చేయనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి భీమవరం పర్యటనను అధికారులు సమష్టి కృషితో విజయవంతం చేయాలన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సభావేదిక, హెలీప్యాడ్ స్థలాల్లో ఉన్న వర్షం నీటిని తోడించి, నేల చదును చేసి హెలీప్యాడ్ గ్రౌండింగ్ కోసం కాంక్రీటు హెచ్ సర్కిల్, బారికేడ్లు తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: రాష్ట్రంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఆరున్నర లక్షల టన్నులకు పైగా ధాన్యం కొనుగోలు చేశామని పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇరగవరం, కంతేరు, కొత్తపాడు, కత్తవపాడు గ్రామాల్లో ఆయన పర్యటించి తడిసిన ధాన్యం, దెబ్బతిన్న వరిచేలను పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు ఉన్న ధాన్యాన్ని ఉన్నట్టుగా, కొద్దిమేర మొలక వచ్చినా కొనుగోలు చేస్తున్నామన్నారు. అధికారులు చేలను పరిశీలించి ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా వచ్చేలా చూస్తారన్నారు. రైతులను ఆదుకోవడానికి కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. మొత్తంగా రూ.1,150 కోట్లు ధాన్యం సొమ్ములు చెల్లించామని, రూ.190 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. గతంలో వ్యవసాయం దండగ అన్న నాయకులు ఇప్పుడు రైతుల దగ్గరకు వచ్చి కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. 2014లో టీడీపీ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించకపోతే 2019లో సీఎం జగన్ అందించారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, దళారీ వ్యవస్థ లేకుండా చేసేందుకు సీఎం జగన్ ఎంతో కసరత్తు చేశారని, రైతులంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకుంటుందన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, కొత్తపాడు సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స రామభద్రరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ రాఘవేంద్ర, నాయకులు కిషోర్, జవ్వాది సురేష్ ఆయన వెంట ఉన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి కారుమూరి

గుర్రపుడెక్క తొలగింపు



పోల్‌రాజ్ కాల్వ వద్ద గుర్రపుడెక్క తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

సాక్షి స్పందన

కైకలూరు: మిచాంగ్ తుపాను కారణంగా ఎగువ నుంచి కొట్టుకు వచ్చిన గుర్రపుడెక్క కొల్లేటి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. ఈ సమస్యపై 'గుర్రపుడెక్క గుబులు' శీర్షికన 'సాక్షి'లో శుక్రవారం ప్రచురించిన కథనంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. కొల్లేరుకు చేరే నీటిని సముద్రానికి చేరవేసే ప్రధాన వంతెన పెదఎడ్లగాడి, అలాగే చినఎడ్లగాడి, పోల్‌రాజ్ కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పరిశీలించారు. పోల్‌రాజ్ కాల్వ వద్ద పొక్లెయిన్‌తో చేపట్టిన గుర్రపుడెక్క తొలగింపు పనులను పర్యవేక్షించారు.

తక్షణమే లీకేజీలు అరికట్టాలి

పాలకొల్లు అర్బన్: నరసాపురం–నిడదవోలు పంట కాలువలో నీరు దిగమర్రు ఛానల్‌లోకి లీకవ్వకుండా తక్షణం చర్యలు చేపట్టాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదేశాలిచ్చారు. ప్రధాన కాలువలో నీరు లీకవ్వడం వలన దిగమర్రు, పెదమామిడిపల్లి, కొత్తపేట, వరిధనం, కాజ గ్రామాల్లోని పంట చేలల్లో మురుగు నీరు లాగడం లేదని రైతులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. తక్షణం లీకేజీలను అరికట్టాలని ఆదేశాలిచ్చారు. అలాగే పాలకొల్లు మున్సిపల్ డ్రెయిన్లలో నీరు దిగమర్రు పంట కాలువలోకి చేరి పంట నీరు కలుషితమవుతోందని పలువురు సర్పంచ్‌లు, రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మురుగునీరు కలుస్తున్న ప్రాంతాలను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన గుర్తించారు. సంబంధిత గృహ యజమానులకు నోటీసులిచ్చి మురుగునీరు పంట కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, పార్టీ నాయకులు కవురు భాస్కరబాబు, కవురు గాంధీ, ఇరిగేషన్ ఏఈ ఎస్.శ్రీనివాస్ ఉన్నారు.



పంట కాలువను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి

గోదారమ్మకు నీరాజనం

నరసాపురం: విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం నరసాపురం వశిష్ట గోదావరి పంటు రేవు అమరేశ్వరస్వామి ఆలయం వద్ద గోదావరి మాతకు హారతి కార్యక్రమం వేడుకగా జరిగింది. 60 మంది స్వామీజీలు, వివిధ పీఠాల అధిపతులు ప్రత్యేక పూజల మధ్య ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ స్వామీజీలు యాత్రగా ఇక్కడకు వచ్చిన గోదావరి మాతకు పూజలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందన్నారు. సీహెచ్ రెడ్డప్ప ధవేజీ మాట్లాడుతూ నాసిక్ నుంచి గోదావరి ప్రయాణించే ప్రాంతాలను సందర్శిస్తూ స్వామీజీలు ఇక్కడకు వచ్చారన్నారు. పట్టణవాసులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



హారతి ఇస్తున్న చీఫ్ విప్ ముదునూరి

ఆధ్యాత్మిక చింతనతో శాంతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో పోటీతత్వంతో పాటు భక్తిభావం పెరగాలని, ఇతరులను గౌరవించడం నేర్చుకోవాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జన్మదినోత్సవాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలకు శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ఆడిటోరియంలో బహుమతులు అందించారు. ముఖ్య అతిథిగా డీఐజీ మాట్లాడుతూ ఆధ్యాతిక చింతనతో సమాజంలో శాంతి నెలకొల్పవచ్చని, మనుషుల్లో నేరప్రవృత్తి నియంత్రణకు భక్తిభావమే ప్రధాన మార్గమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మోటివేషన్ స్పీకర్ మల్లేష్ అన్నామైన చేసిన ప్రసంగం విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ సత్యసాయి సేవా సంస్థల గౌరవాధ్యక్షుడు కొమ్మారెడ్డి భాస్కరరావు, సీఆర్ఆర్ విద్యాసంస్థల పాలక మండలి కార్యదర్శి ఎంబీఎస్వీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు వీవీ బాలకృష్ణారావు, జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖరరావు పాల్గొన్నారు.

తుపాను పరిహారం అందించేందుకు కృషి

పెనుగొండ: మిచాంగ్ తుపానుతో నష్టపోయిన ప్రతి రైతుకూ నష్టపరిహారం అందించేలా కృషిచేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. శుక్రవారం తూర్పుపాలెంలో రైతులతో సమీక్షించారు. తుపానుతో తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో రైతులు అధికంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలతో కోతలు పూర్తి చేసి కల్లాల్లో ధాన్యం ఉన్న కొంతమంది రైతులు మాత్రం గట్టెక్కారన్నారు. ధాన్యం రాశుల్లో నిలువ ఉంచి రక్షణ కల్పించినా కొన్ని ప్రాంతాల్లో మొలకలు వచ్చాయని, అలాగే నేల నంటిన వరి చేలల్లోనూ మొలకలు వచ్చాయన్నారు. తీవ్రంగా వచ్చిన నష్టాన్ని సీఎం జగన్‌కు వివరిస్తామని, నష్ట అంచనాల తయారీని అధికారులు ప్రారంభించారన్నారు. పూర్తిస్థాయిలో అంచనా వేసి ఆదుకొనేలా చర్యలు తీసుకుంటామని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పోడూరు జెడ్పీటీసీ గుంటూరిపెద్దిరాజు, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, ఆచంట వేమవరం సర్పంచ్ జక్కంశెట్టి చంటి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మామిడిశెట్టి కృష్ణవేణి, పార్టీ నాయకులు గణేషుల సుబ్బారావు, ముత్యాల నాగేశ్వరరావు, నౌడు దుర్గారావు, నక్కా శ్రీను, ఆదిరెడ్డి సన్యాసిరావు, తిక్కిరెడ్డి పవన్, కుడిపూడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో రైతులతో సమీక్షిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

క్లుప్తంగా

కఠోర శ్రమతోనే విజయాలు సాధ్యం


విద్యార్థులకు యంత్రాల పనితీరు, ప్రాధాన్యత గురించి వివరిస్తున్న నిట్ ప్రొఫెసర్ వి.సందీప్

తాడేపల్లిగూడెం : విజేతల వెనుక ఎలాంటి మంత్రదండం ఉండదని, కఠోర శ్రమ, పట్టుదల వారిని విజేతలుగా నిలుపుతాయని ఏపీ నిట్ ఆచార్యుడు వి.సందీప్ అన్నారు. శుక్రవారం నిట్‌ను సందర్శించిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చక్కని ప్రణాళిక, అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే అందరిమన్ననలు పొందే స్థాయికి విద్యార్థులు ఎదుగుతారన్నారు. విద్యార్థులు వేసే ప్రతీ అడుగు విజయాలకు మెట్లుగా నిలిచినప్పుడు ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుంటే ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించవచ్చన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి క్షేత్రస్థాయి పర్యటనలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు యంత్రాల పనితీరు తదితరాల గురించి వివరించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లాలోని కోర్టులున్న అన్ని ప్రదేశాలలో ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లా కోర్టులో ఉదయం 10 గంటలకు జాతీయ లోక్ అదాలత్ ప్రారంభిస్తారన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పోడూరు: పోడూరులో అక్రమంగా నిల్వచేసిన 2.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన మండా నాగేశ్వరరావు వద్ద అక్రమంగా రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం తెలియడంతో స్థానిక సివిల్ సప్లయిస్ డీటీ సత్యనారాయణ, ఆర్ఐ కందుల రాంబాబు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాగేశ్వరరావుపై 6ఎ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

వెదురుతో కళాకృతులు

- గిరిజన మహిళల ప్రతిభ
- ప్రోత్సహిస్తున్న ఉద్యాన వర్సిటీ


వెదురు ఆకృతుల తయారీలో మహిళలు


వెదురు ఫ్లవర్ వాజ్

తాడేపల్లిగూడెం : గిరిజన ప్రాంతాల్లోని మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వెదురుతో కళాకృతులు, ఫర్నీచర్, ఇతర వస్తువుల తయారీలో శిక్షణ ఇస్తున్నారు. వెదురుకు సొబగులు అద్ది కళాకృతులను తయారు చేస్తున్నారు. గిరి సృజన వారే పేరిట మార్కెటింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసుకున్నారు. భూ50 నుంచి 60 అడుగుల ఎత్తు వరకు ఎదిగి, ఒకసారి నాటితే 70 ఏళ్లపాటు దిగుబడి నిచ్చే వెదురును అటవీశాఖ నుంచి ఇటీవలే ప్రభుత్వం ఉద్యాన శాఖ పరిధిలోకి చేర్చింది. వెదురు ఏపుగా పెరిగిన ప్రాంతాలలోని వెదురును తీసుకొచ్చి కళాకృతులుగా మార్చే కార్యక్రమానికి ఉద్యాన విశ్వవిద్యాలయం ఇటీవల శ్రీకారం చుట్టింది. ఏలూరు జిల్లా పరిధిలోని బుట్టాయగూడెం మండలం పరిధిలోని గ్రామాల్లోని మహిళలకు ఐటీడీఏ కెఆర్‌పురం ద్వారా ఉద్యాన వర్సిటీ పర్యవేక్షణలో 90 రోజుల శిక్షణ ఇచ్చారు. ఉద్యానవర్సిటీ పర్యవేక్షణలో 20 మందికి వెదురు ఎంపిక, కోసే విధానం, వస్తువుల తయారీలో నిపుణులైన మచ్చ మారయ్య, కిచ్చా రామిరెడ్డితో శిక్షణ ఇప్పించారు. వెదురు కళాకృతులు, పెన్‌స్టాండ్, పడవ, ఇల్లు, మంచం, టీపాయి, సోఫా, కుర్చీ, పూలబుట్ట, కూరగాయల బుట్టల వంటి తయారీలో శిక్షణనిచ్చారు. జీర్ణక్రియను మెరుగుపర్చడానికి వెదురు మొక్కల ఆకులతో తయారు చేసిన టీ అద్భుతంగా ఉంటుంది. ఈశాన్య రాష్ట్రాలలో వెదురుమొక్క లేత కొమ్మతో ఊరగాయ పడతారు. ఇలాంటి వాటిపై కూడా శిక్షణనిచ్చే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో కూడా వెదురు సాగు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించడంతో వెదురుతో తయారు చేసే వస్తువులు, వాడకం, వినియోగంపై శ్రద్ధ పెట్టారు. కాలుష్యనివారణకు థర్మల్ విద్యుత్ తయారీలో వెదురు వినియోగించే దిశగా అడుగులు పడుతున్నాయి.

గిరి సృజన ద్వారా విక్రయాలు

శిక్షణ పొందిన మహిళలు గిరి సృజన అనే గ్రూపును ఏర్పాటుచేసుకొని వెదురుతో తయారుచేసిన వస్తువులను విక్రయించే ఏర్పాటు చేసుకున్నారు. పళ్ల బుట్ట రూ.200, పెన్‌స్టాండ్ రూ. 200, పడవ ఆకృతి రూ. 500, ఇంటి ఆకృతి రూ.500, ఫ్లవర్‌వాజ్ రూ.300, మంచం రూ.15,000, సోఫాసెట్టు రూ.2500గా నిర్ణయించారు.

ఆత్మస్థైర్యం నింపింది



వెదురుతో వాణిజ్య హంగులు కలిగిన ఉత్పత్తులు తయారుచేయడంలో పొందిన శిక్షణ, వచ్చే ఆదాయం నాలో ఆత్మస్థైర్యం నింపింది. ఖాళీ సమయాలలో వెదురు ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తున్నాం. వివిధ మార్గాలలో వాటిని విక్రయిస్తున్నాం,. ఉద్యాన వర్సిటీ శిక్షణ అక్కరకు వచ్చింది.

– కొవ్వాసు సుధారాణి, శిక్షకురాలు

ఇంటి ఖర్చులకు సంపాదిస్తున్నాను



ఇంటికి ఉపయోగపడేలా ఆదాయం పొందాలని అనుకునేదాన్ని.. ఇలాంటి తరుణంలో వెదురు ఆధారిత ఉత్పత్తులపై ఇచ్చిన శిక్షణ ఉపయోగపడింది. ఇలాంటి అవకాశం కల్పించిన ఉద్యానవర్సిటీకి, కెవికె వారికి ధన్యవాదాలు.

– కొవ్వాసు వెంకటలక్ష్మి, శిక్షకురాలు

ఓటరు నమోదుకు నేటితో ఆఖరు

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటరు నమోదుకు నేటితో ఆఖరి రోజని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ చాంబరులో కలెక్టర్ పి.ప్రశాంతి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9న ఓటు నమోదుకు, మార్పులకు చివరి తేదీ అని చెప్పారు. ఫొటోలు మారిపోయినా, పేర్లు మళ్లీ వచ్చిన వారి జాబితాను పరిశీలించి, సరిచేసేందుకు నివేదిక సిద్ధం చేస్తామన్నారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు, మరణించిన ఓటర్లు, ఇంటి నెంబరు ఇతర అంశాలు తప్పుగా నమోదైతే వారి గురించి ప్రధాన రాజకీయ పార్టీల ఫిర్యాదులు పరిశీలించి జాబితాలను సిద్ధం చేస్తామన్నారు. నోటీసు అందుకున్న వారు ఆందోళన చెందవద్దని, పూర్తి పరిశీలన తర్వాత మాత్రమే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. వివిధ నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో సమావేశమై ప్రత్యేక ఓటర్ల జాబితా ప్రక్రియపై నియోజకవర్గాల వారీగా, మండలాల వారీగా సమీక్షించారు. జాబితాలో ఒక ఓటరు పేరు ఒక్కసారి మాత్రమే రావాలని, డూప్లికేట్లు లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారి బి.శ్రీమన్నారాయణ రెడ్డి, ఆర్డీవోలు యం.అచ్యుత అంబరీష్, కె.శ్రీనివాసులు రాజు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

పౌర సరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్


పెదకడిమిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌర సరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్

పెదవేగి : తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ధాన్యాన్ని సేకరించే క్రమంలో రైతులకు వంకలు చెప్పకుండా మిల్లర్లు ధాన్యాన్ని సేకరించాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ చెప్పారు. తుపాను బారిన పడి తడిసిన పంటలను పరిశీలించేందుకు పౌర సరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ శుక్రవారం పెదవేగి మండలం విచ్చేశారు. అమ్మపాలెం, పెదకడిమి గ్రామాలలో పౌరసరఫరాల సంస్థ కమిషనర్ అరుణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వర రావు, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కె ఖాజావలి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆళ్ల సతీష్ చౌదరి, వ్యవసాయ శాఖ జేడీ రామకృష్ణ, పెదవేగి తహసీల్దార్ నల్లమెల్లి నాగరాజు, మండల వ్యవసాయాధికారి ప్రియాంకతో కలిసి నేరుగా పంట పొలాలకు వెళ్లి తడిసిన పంటను, ధాన్యం రాసులను పరిశీలించారు. ధాన్యం కుప్పలను కూడా పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు దిగులు పడవద్దని కమిషనర్ భరోసా ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించి రైతులకు గిట్టు బాటు ధర కల్పిస్తామని చెప్పారు. ధాన్యంలో తేమ శాతం వంక చూపి రైతులను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని కమిషనర్ ఆదేశించారు.

తుపాను బాధిత రైతుల్ని ఆదుకుంటాం

పెదపాడు: నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తింపజేస్తామని, మిచాంగ్ తుపాను బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో రైతు భరోసాకేంద్రం, వట్లూరులోని సత్యకృష్ణ రైస్‌మిల్, వట్లూరులోని పంటపొలాలు అమ్మపాలెం రోడ్డులో ధాన్యం రాసులను రైతులతో కలిసి పరిశీలించారు. కొక్కిరపాడు రైతు భరోసా కేంద్రంలో ధాన్యం సేకరణ విధానం, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కోత కోయకుండా ఉన్న పొలాలు ఎంత మేర దెబ్బతిన్నాయి.. కోసిన పనలకు ఎంతమేర నష్టం జరిగింది, ధాన్యం ఎంత శాతం దెబ్బతిందీ వ్యవసాయ అధికారులు పరిశీలించి నివేదికలు తయారు చేయాలని, 3 రోజుల్లో ఎన్యుమరేషన్ పూర్తవుతుందన్నారు. కోత కోసిన పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట కోయకుండా నష్టం జరిగిన వాటికి పంటల బీమా వర్తింపచేస్తామని చెప్పారు.

ఫైనాన్స్ కంపెనీల్లో దోపిడీకి యత్నం


నూజివీడులోని ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్‌వీ మురళీకృష్ణ

నూజివీడు: నూజివీడు పట్టణంలో పలు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో దోపిడీకి ప్రయత్నించిన సంఘటన వెలుగు చూసింది. బస్టాండు రోడ్డులో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్ కార్యాలయంలోకి చొరబడేందుకు దుండగుడు ఐదో తేదీ రాత్రి విశ్వప్రయత్నాలు చేశాడు. మొహానికి ముసుగు ధరించి తాళాలను పగలగొట్టడానికి ప్రయత్నించి విఫలమై వెళ్లిపోయాడు. గురువారం రాత్రి పట్టణంలోని ఎన్నెస్పీ గేటు సమీపంలో ఉన్న ఫిన్‌కేర్ సంస్థ కార్యాలయంలోకి చొరబడేందుకు ప్రయత్నించాడు. షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించిన తరువాత మరో తలుపు తీయడానికి ప్రయత్నించగా సైరన్ మోగడంతో దుండగుడు బయటకు వెళ్లిపోయాడు. దుండగుడు మొహానికి ముసుగు ధరించాడు. దీంతో రెండు చోట్ల దోపిడీకి యత్నించిన వ్యక్తి ఒక్కరేనన్న అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్‌వీ మురళీకృష్ణ శుక్రవారం ఫిన్‌కేర్, ముత్తూట్ కార్యాలయాలను సందర్శించి సంఘటన జరిగిన తీరుతెన్నులను పరిశీలించారు. సీసీ కెమెరాల్లో ఫుటేజీని సేకరించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరిస్తున్నాయి. ప్రజల సొమ్మును తీసుకుంటున్నందున దానికి భద్రత కల్పించాల్సిన బాధ్యత కూడా నిర్వర్తించాలన్నారు. నష్టం జరిగాక ఇబ్బందులు పడేకంటే ముందే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీ ఫుటేజీ, దొరికిన క్లూస్ ద్వారా నిందితుడిని గుర్తిస్తామన్నారు.

వ్యాయామ పోటీలకు ఎంపిక


విద్యార్థి ఆదిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం మూడో సంవత్సరం విద్యార్థి గొల్ల ఆది వ్యాయామంలో నేషనల్ లెవెల్ క్యాంప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థి ఆదిని అభినందించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ గత నెల 3న నన్నయ యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్, వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ లెవెల్ అడ్వెంచర్ క్యాంపు సెలెక్షన్స్‌లో ఎంపికయ్యాడన్నారు. ఈ నెల 18 నుంచి 28 వరకూ హిమాచల్ ప్రదేశ్‌లో జరిగే క్యాంప్ సెలెక్షన్స్‌లో పాల్గొంటాడన్నారు.

నేటి నుంచి మావుళ్లమ్మ దర్శనం నిలిపివేత

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం 60వ ఉత్సవ మహోత్సవాలు సందర్భంగా శ్రీ అమ్మవారి దేవాలయం అలంకరణ, అమ్మవారికి విగ్రహానికి రంగులు వేసేందుకు దర్శనం నిలిపివేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈఓ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. ఈనెల 9 నుంచి 28 వరకూ దర్శనం నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 28 ఉదయం 11 గంటలకు కళాన్యాసం జరిపి అమ్మవారి మూల విగ్రహ దర్శనం పునఃప్రారంభిస్తామన్నారు. అప్పటి వరకూ అమ్మవారి గర్భాలయం వెనుక ప్రదక్షిణ మండపంలో ఉత్సవ విగ్రహానికి పూజలు యథావిధిగా జరుగుతాయన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

ఏలూరు టౌన్: అంతర్‌జిల్లా దొంగను ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ ఎస్.రాజశేఖర్ వివరాలు తెలిపారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌కు చెందిన కాళిదాసు విజయకృష్ణ (40) 2003లో హోంగార్డుగా విధులు నిర్వర్తించేవాడు. హోంగార్డుగా ఉంటూనే చోరీలకు అలవాటు పడ్డాడు. బంగారు ఆభరణాలు, మోటారు సైకిళ్ళను చోరీ చేస్తూ ఉండేవాడు. 2006లో చోరీలకు పాల్పడుతున్న అభియోగాలపై అతడ్ని హోంగార్డు విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి అనేక ప్రాంతాల్లో గొలుసులు, మోటారు సైకిళ్లను చోరీ చేస్తున్నాడు. అతనిపై 16 కేసులు ఉన్నాయి. విజయకృష్ణ నుంచి 8 గ్రాముల బంగారం, 5 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

మనస్తాపంతో భార్య ఆత్మహత్య

పాలకోడేరు: భర్త మద్యానికి బానిస కావడంతో మనస్తాపంతో భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గరగపర్రు గ్రామానికి చెందిన ఈరి నరేష్, దుర్గాభవాని (35)లకు 16 ఏళ్ళ క్రితం పెళ్ళయ్యింది. కుమార్తె, కుమారుడు ఉన్నారు. నరేష్ మద్యానికి బానిసై తరచూ పొట్లాడుతుండేవాడు. ఈ నెల 7న నరేష్ మద్యం తాగి ఇంటికి రాగా.. తాగుడు మానకపోతే ఏదైనా తాగి చస్తానంటూ అక్కడే ఉన్న గడ్డి మందు తాగింది. వెంటనే భీమవరం ప్రభుత్వాసుపత్రికి , మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. పాలకోడేరు పోలీస్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న జామాయిల్ పట్టివేత

నూజివీడు: అటవీ ప్రాంతంలోని సంపదను అక్రమంగా కొల్లగొట్టి అమ్ముకుంటున్న వ్యక్తిని అటవీ అధికారులు పట్టుకోవడంతో పాటు ఆటోను సీజ్ చేసిన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. నూజివీడు మండలం జంగంగూడెం అటవీ ప్రాంతంలో తొమ్మండ్రు యాకోబు, కాటుమాల రాంపండు ఆటోలో అర్ధరాత్రి 11.30గంటల సమయంలో జామాయిల్ కర్రను నరికి ఆటోలో తరలిస్తుండగా డీఆర్‌వో విజయశేఖర్, బీట్ ఆఫీసర్ శివయ్యలు కలిసి ఆటోను సీజ్ చేసి యాకోబు, రాంపండులను అదుపులోకి తీసుకుని నూజివీడు అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నూజివీడు సమీపంలోకి వచ్చే సరికి యాకోబు అటవీశాఖ అధికారుల కళ్లు గప్పి పరారయ్యాడు. పట్టుబడిన జామాయిల్ విలువ రూ.20 వేలు ఉంటుందని అంచనా. దీనిపై నివేదికను డీఎఫ్‌వోకు పంపనున్నట్లు డీఆర్‌వో విజయశేఖర్ తెలిపారు.

ఆక్వాపై చలి ఎఫెక్ట్

మిచాంగ్ తుపానుతో ఉష్ణోగ్రతల్లో మార్పు



కైకలూరు: మిచాంగ్ తుపాను తీరం దాటి వెళ్ళినా దాని ప్రభావం ఇంకా కొనసాగుతోంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో మార్పు కనిపిస్తోంది. చలి వాతావరణంలో తేమ శాతం తగ్గకపోవడం, ఉష్ణోగ్రతల్లో పెరుగుదలతో ప్రజలు జలుబు, జ్వరాల బారినపడుతోన్నారు. ప్రధానంగా ఆక్వా రంగంపై చలి పంజా విసురుతోంది. శుక్రవారం మధ్యాహ్నం ఏలూరులో 29 డిగ్రీలు ఉంటే రాత్రికి 22 డిగ్రీలు నమోదైంది. తణుకు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో రాత్రి ఉష్ణోగ్రత 22 డిగ్రీలకు చేరింది. భీమవరంలో మధ్యాహ్నం 30, రాత్రి 23 డిగ్రీలు నమోదైంది. తుపాను వెళ్ళిన తర్వాత సాధారణ పరిస్థితులు ఇప్పటికీ రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఆక్వా రంగం ఆందోళన

వాతావరణ మార్పు ఆక్వా రంగంపై ఎక్కువగా ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 2.80 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. పెదపాడు, ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, కైకలూరు, మండవల్లి, ఆకివీడు మండలాల్లో ఆక్వాసాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. సాధారణంగా చేపలు 28 డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 32 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు తట్టుకుంటాయి. ఇటీవల 18 డిగ్రీలకు సైతం ఉష్ణోగ్రతలు పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం వల్ల ఆక్సిజన్ సమస్యతో చేపలు మరణించే అవకాశం ఉంది.

కొద్ది రోజుల్లో సాధారణ పరిస్థితులు

వాతావరణంలో తేమశాతం ఉండటంతో చలి తీవ్రత ఉందని విజవాడకు చెందిన వాతావరణ శాస్త్రవేత్త కరుణసాగర్ చెప్పారు. గురువారం కొన్ని ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉందని, ప్రస్తుతం సాధారణ ఉష్ణోగ్రతల స్థాయికి వాతావరణం మారుతుందన్నారు. తుపాను వెళ్ళిన తర్వాత ఇలాంటి పరిస్థితి ఉంటుందని తెలిపారు.

చలిగాలులతో ప్రమాదం



మిచాంగ్ తుపాను తర్వాత చలిగాలుల తీవ్రత ఉంది. చిన్న పిల్లలకు జలుబు, దగ్గు, న్యుమోనియా వచ్చే అవకాశాలు ఎక్కువ. పెద్దలు జాగ్రత్తగా ఉండాలి. చలిగాలులకు బయటకు రాకపోవడం ఉత్తమం. ప్రజలు నీటిని కాచి చల్లార్చుకుని తాగాలి.

– బి.శంకర్, పీహెచ్‌సీ వైద్యులు, కొల్లేటికోట

చెరువుల్లో తగ్గుతున్న ఆక్సిజన్



చెరువుల్లో ఆక్సిజన్ సమస్య ఉత్పన్నమవుతోంది. కార్బన్ డయాక్సైడ్ 1.5 పీపీఎం, అమ్మోనియా 0.05, నైట్రేట్ 1 పీపీఎం కంటే తక్కువగా ఉండేలా చూడాలి. చలి కాలంలో పగలు 20 రోజులకు ఒకసారి 30 కేజీల సున్నం చల్లాలి. సేంద్రీయ ఎరువులు వాడొద్దు

– బి.రాజ్‌కుమార్, ప్రభుత్వ ఆక్వా ల్యాబ్ ఏడీ, కైకలూరు

చోరీ సొత్తు స్వాధీనం


పెనుగొండలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పైడేశ్వరరావు

పెనుగొండ: ఎనిమిది నెలలుగా వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పెనుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.8 లక్షల విలువైన బంగారు అభరణాలు, మోటార్‌సైకిలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు భీమవరం సీసీఎస్ డీఎస్పీ, నర్సాపురం ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు పెనుగొండ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. పెనుగొండ చెరుకువాడకు చెందిన కోసూరి కరుణ చుట్టుపక్కల, ఇతర ప్రాంతాల్లో రాత్రి పూట తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్నాడు. రోడ్డు పక్కన పార్క్ చేసిన ఉన్న మోటార్ సైకిళ్లను మారు తాళాలతో చోరీ చేస్తున్నాడు. వాటిని తాకట్టు పెట్టి అవసరాలు తీర్చుకోవడంతో పాటు, జల్సాలకు ఖర్చు చేసేవాడు. పక్కా సమాచారంతో పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్‌లు కరుణను శుక్రవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నాడు. 101.270 గ్రాముల బంగారు అభరణాలు, కేజీకి పైగా వెండి వస్తువులు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకొన్నారు.

రూ.2.40 లక్షల నగదు చోరీ


గుమ్ములూరు సెంటర్‌లోని సుజికి షోరూంలో చోరీ జరిగిన తీరును పరిశీలిస్తున్న పోలీసులు

ఆకివీడు: సుజికి షోరూమ్, ఆక్వా షాపుల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుమ్ములూరు ప్రధాన సెంటర్‌లోని షోరూమ్, ఆక్వా షాపులో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. అదే సమయంలో పెదకాపవరంలోని మరో ఆక్వా షాపులో చోరీకి యత్నించగా అక్కడ ఏమీ దొరకలేదు. సుజుకీ షోరూం వెనుక తాళాలు బద్దలుకొట్టి సీసీ కెమెరా వైర్లు పీకేశారు. బీరువా తాళాలు బద్దలుకొట్టి దానిలోని రూ. 2.40 లక్షల నగదు దోచుకున్నారు. సీసీ కెమెరాకు సంబంధించిన డీవీఆర్, ఇంటర్నెట్, వైఫై రూటర్లను దొంగిలించారు. షోరూమ్ పక్కనే ఉన్న ఆక్వా షాపు తాళాల్ని బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించారు. సీసీ కెమెరా వైర్లను పీకివేశారు. డీవీఆర్, రూటర్లను ఎత్తుకుపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు చెప్పారు. ఇటీవల స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఆక్వా షాపులో చోరీ జరిగింది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ శ్రీనాథ్, రూరల్ సీఐ సత్యకిషోర్‌లు సందర్శించి, దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ చెప్పారు.

జగన్ కోసం తిరుపతికి పాదయాత్ర


భీమడోలుకు చేరుకున్న గాలి గణేష్, అనుచరుల పాదయాత్ర

భీమడోలు: జగన్ మళ్లీ సీఎం కావాలన్న సంకల్పంతో వైఎస్సార్ అమరజ్యోతి స్టూడెంట్స్ అండ్ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు గాలి గణేష్ బృందం విశాఖపట్నం నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం ఏలూరు జిల్లా భీమడోలుకు చేరుకుంది. వైఎస్సార్ అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో ఉన్నత విద్య చదివానని, అందుకే వైఎస్సార్‌తో పాటు ఆయన కుటుంబానికి వీరాభిమానినయ్యానని ఆయన చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నర ఏళ్లుగా ఇచ్చిన హామీలకు కట్టుబడి అన్నింటినీ అమలు చేస్తూ ప్రజారంజక పాలనను అందిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం జెడ్.కొత్తపట్నంకు చెందిన గణేష్ గత నెల 30న విశాఖపట్నం నుంచి బృందంతో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజైన డిసెంబర్ 21న తిరుమలకు చేరుకుంటామన్నారు.

క్లుప్తంగా

బలుసులమ్మకు విశేష పూజలు



బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీటీసీ): కార్తీక మాసం ఆఖరి శుక్రవారం కావడంతో పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారిని భక్తులు, విశేషంగా మహిళలు హాజరై దర్శించుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఆలయం వద్ద విశేష పూజలు జరిగాయి. ఆలయంలో అన్నదానం సందర్భంగా అన్నదానానికి రూ.18 వేలు దాతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొట్టు అంజిబాబు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రవి శంకర్, ఉత్సవ కమిటీ సభ్యులు రాము తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే జగనన్న ధ్యేయం



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్

పెంటపాడు: రైతుల అభ్యున్నతే సీఎం జగనన్న ధ్యేయమని, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పెంటపాడు మండల కార్యాలయం వద్ద వ్యవసాయ, సలహామండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరే ఈ క్రాఫ్ నమోదు పూర్తి శాతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ, ఏవో పార్ధశారది, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఇరిగేషన్, పశువైద్యశాఖ అధికారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

పెంటపాడు: తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల బాబూరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన పెంటపాడు మండలంలోని రాచర్ల, కొండేపాడు, అలంపురం, ప్రత్తిపాడు గ్రామాల్లో ధాన్యం ఆరబెడుతున్న రైతులను మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కరెడ్ల రామకృష్ణ, ఆయా గ్రామాల కమ్యూనిస్టు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి



అలంపురం టీబీఆర్ సంస్థలో విద్యార్థినులకు బెటాలియన్ శిక్షణ అందిస్తున్న దృశ్యం

పెంటపాడు: విద్యార్థినులు దేశభక్తిని పెంపొందించుకోవాలని మాజీ సైనిక ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకులు తనబుద్ధి భోగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం అలంపురం టీబీఆర్ గ్రౌండ్‌లో విద్యార్థినులకు బెటాలియన్ శిక్షణ అందించారు. ఎన్‌సీసీలో వెపన్‌లు ఎలా ఉపయోగించాలో, మ్యాపింగ్, ఫీల్డ్ సిగ్నల్ తదితర వ్యవస్థలపై కమాండర్ వివరించారు. టీబీఆర్ సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

భీమవరం: భీమవరం కోర్టుల్లో శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మండలన్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌కు వచ్చే కక్షదారులకు న్యాయవాదులు, పోలీస్ అధికారులు సహకరించాలన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీపడదగిన క్రిమినల్, సివిల్, కుటుంబతగాదా కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమాకు సంబంధించిన కేసులు ఉభయ కక్షిదారుల ఆమోదం మేరకు రాజీ చేయనున్నట్లు శ్రీసత్యాదేవి తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామానికి చెందిన సోడదాసి గాబ్రియేలు(72) ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. వీఆర్వో శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాళ్ళకూరులోని వెంకటాపురం ప్రాంతంలో పంటకాలవలో పూడికతీత పనులు చేస్తున్న గాబ్రియేలుకు 12 గంటల సమయంలో చాతిలో నొప్పి రావడంతో కాలువలో నుంచి గట్టు పైకి వచ్చి అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సర్పంచ్ మృతుడి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా రూ.5,000, దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ మరో రూ.5,000, సహాయం అందించారు.

మనసున్న మారాజు సీఎం జగన్



పెంటపాడు : గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న నాయకులు



తాడేపల్లిగూడెం రూరల్: మాధవరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

సందడిగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

పెంటపాడు: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని, మనసున్న మారాజు సీఎం జగన్ అని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. పెంటపాడు మండలం 'వై నీడ్స్ ఏపీ జగన్' కార్యక్రమం రెండు సచివాలయాల్లో శుక్రవారం సాయంత్రం స్థానిక ఆయా సచివాలయాల వద్ద పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ అర్హలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ పేద ప్రజల పిల్లలకు కార్పొరేట్‌కు ధీటుగా పాఠశాలలను ఏర్పాటు చేసి నాడు- నేడు పథకం అందజేశారన్నారు. ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు, గృహ సారథులతో కలిసి బ్రోచర్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ మైలవరపు పెదబాబు, ఎంపీటీసీ

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం



తాడేపల్లిగూడెం అర్బన్: 16వ వార్డులో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం అర్బన్ : పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యమని 16వ వార్డు ఇన్‌చార్జ్ గుండుబోగుల బలుసులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని స్థానిక 16వవార్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ గుండుబోగుల బలుసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలందరూ ఆర్థిక పుష్టిని సాధించారన్నారు. వలంటీర్లకు మా నమ్మకం జగన్ కిట్లను పంపిణీ చేశారు. వార్డు ప్రజలు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, , కర్రి భాస్కరరావు, వట్టి బుజ్జి, పట్నాల గణపతి, కోడే శ్రీనువాస్ రాజా త్రినాథ్, బోణం విజయనిర్మల, మున్సిపల్ ఏఎస్ఓ సురేష్, దింటకుర్తి లీలావతి, రజని, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, పార్టీ నాయకులు నల్లమిల్లి విజయానందరెడ్డి, యూత్ నాయకులు కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు జయరాంబాబు, బండారు రాంబాబు, గూడెం ఏఎంసీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కర్రి వరహాలరెడ్డి, సలుమూరి ప్రకాష్, శివారెడ్డి, వరహాలరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు తదితరలు పాల్గొన్నారు.

పాడి – పంట సంబంధాన్ని తెలుసుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: సాగు చేపట్టిన ఆరు నెలల వరకు పంట చేతికి రాదని, ఆ సమయంలో పాడి పశువులుంటే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ జరిగేదని, పాడి – పంటకు ఉన్న అవినాభావ సంబంధాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మాధవరం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పశువైద్యం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారిత, స్వావలంబనకు నాడు మాజీ ప్రధాని దివంగత పీవీ.నరసింహారావు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అయితే డ్వాక్రా గ్రూపుల ఏర్పాటులో మానస పుత్రుడిని తాను అని చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నాడన్నారు. ఎస్‌హెచ్‌జీలకు రివాల్వింగ్ ఫండ్ తోడు కావడంతో డ్వాక్రా గ్రూపులుగా పరిణతి చెందాయన్నారు. అనంతరం 45 కోట్ల 11లక్షల 47వేల 370 రూపాయల సంక్షేమ పథకాల బ్యానర్‌ను పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాన్ని ప్రజలకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్పీటీసీ కవులూరి సుబ్బలక్ష్మి, మార్లపూడి సుబ్బారావు, కొమ్ముగూడెం, నవాబుపాలెం సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, సొసైటీ మాజీ చైర్మన్ వీఎస్‌వీఎస్.నారాయణ, గంధం బాబి, వెంపలి వీరభద్రరావు, వెంపలి జగన్నాథరావు, తారమట్ల శ్రీనివాస్, ప్రత్తి రాజాబాబు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత



యోగా శిక్షణలో పాల్గొన్న యోగా సాధకులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): యోగాతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని శ్రీ సత్యసాయి ధ్యాన మండలి ఛారిటబుల్ ట్రస్ట్ విజయవాడ నిర్వాహకులు, యోగా గురువు బిక్షమయ్య పేర్కొన్నారు. పట్టణంలో అంబికా యోగా సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమం జరిగింది. ఒత్తిడి లేని జీవితం, ఆరోగ్యం, ఆహార నియమాలపై సాధకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరా ఫౌండేషన్ చైర్మన్ కరిబండి రామకృష్ణ, పతంజలి యోగా గురువు వింజుమూరి మాధవరావు, యెగా గురువులు బడుగు చంద్రశేఖర్, అంబికా పాల్గొన్నారు.

భవిత సెంటర్‌లో క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని డైమండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల భవిత కేంద్రంలో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో చిన్నారులకు బుక్స్, స్టేషనరీ, హెల్త్ డ్రింక్స్, ఆట వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ఎస్.సత్యానారాయణ, జామి సత్యనారాయణ, కె.సాయి సత్యనారాయణ రాజు, స్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి



అత్తిలి: క్రీడా పరికరాలను అందజేస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన



ఇరగవరం: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అత్తిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా పరికరాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పైబోయిన మాట్లాడుతూ ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే క్రీడా పోటీలకు సంబంధించి మండలంలోగల 20 గ్రామ సచివాలయాలకు అందజేస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని జిల్లా, రాష్ట్రస్థాయిలో విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటావిజేత నాగరాజు, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీటీసీ అడ్డాల జానకి, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, కంకటాల సతీష్, గారపాటి నాగరాజు, చిటకన వెంకట్రావు, ఎంపీడీవో అమీలుజమా తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో

ఇరగవరం: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌కు సంబంధించి అధికారులకు, వలంటీర్లుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో ఎ శ్రీనివాస్, ఎంఈవో -2 ప్రసాదరావులు తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలిబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మూర్తి, పీఈటీలు, పీడీలు అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం



అత్తిలి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

అత్తిలి: తుపాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంటే ప్రతిపక్షాలు రాజకీయం చేయడం తగదని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం అత్తిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పైబోయిన మాట్లాడారు. తుపాను సమాచారం ముందస్తుగా తెలియడంతో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తణుకు నియోజకవర్గంలోని రైతులను కలుసుకుని కల్లాలపై ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలని ఆదేశించారన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టారని తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, కంకటాల సతీష్, గంటా నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

తణుకు టౌన్: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌కే ఫణిధర్ చెప్పారు. కళాశాల మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన బాల్య వివాహాల అవగాహనా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వివాహ వయస్సు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికార కన్వీనర్ ఏ మారుతీదేవి చౌదరి, అధ్యాపకులు డీ కనక మహాలక్ష్మీ, సీహెచ్ దేవి, బీఎస్ఎల్ పద్మశ్రీ, జి ఇందిర, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రద్దు చేయండి



తణుకులో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

తణుకు: తణుకు బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భూ యజమాన్య హక్కును కాపాడాలని కోరుతూ యాక్ట్ 27కు వ్యతిరేకంగా 5వ రోజు విధులను శుక్రవారం న్యాయవాదులు బహిష్కరించి నిరసన చేపట్టారు. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వి.వి.వి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సివిల్ కోర్టుకు ఉండే భూ వివాదాల పరిష్కారం అధికారాలన్నీ రెవెన్యూ అధికారులకు ఇవ్వడం సరైందికాదన్నారు. చట్టం తెలిసిన అధికారులు లేకపోతే భూ యజమానులకు న్యాయం జరగదని పేర్కొన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ గతంలో నమోదైన భూమి వివరాలు చెల్లుబాటు కాకుండా కొత్త రికార్డులను సృష్టించడం కేవలం కొంతమంది పెట్టుబడిదారులకు ఉపయోగపడుతుందన్నారు. భూ యజమాన్య హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి నాగేశ్వరరావు, హెచ్. నాగార్జునదాసు, నండూరి రామ్మోహన్‌రావు. ఎ.అజయ్ కుమార్, ఎం.కుటుంబరావు, ఎం.సువర్ణరాజు, పుల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



ఆకుతీగపాడు సచివాలయం ప్రాంతంలో ఫీవర్ సర్వేలో పాల్గొన్న ఆరోగ్యశాఖ అధికారులు

పెంటపాడు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై. వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన పెంటపాడు మండలం ముదునూరు ఆరోగ్యశాఖ సిబ్బందితో గ్రామంలో సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైఎస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, డ్రైడే పాటించారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. దోమలు ప్రబలే ప్రాంతాలను గుర్తించి వాటి నిర్మూలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖాధికారులు సత్యనారాయణ, సుజాత, కాంతారావు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

11న యూపీఎఫ్ ఐక్యక్రిస్మస్ ఆరాధన

పెంటపాడు: ఈనెల 11న యునైటెడ్ పాస్టర్స్ ఐక్యక్రిస్మస్ ఆరాధన కార్యక్రమం గూడెం భాగ్యలక్ష్మి పేటలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గూడెం, పెంటపాడు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల యుపీఎఫ్ సభ్యుల కలయికతో ఈ కార్యక్రమం స్థానిక ఎల్ఎల్ఎం విమోచన మందిరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి యుపీఎఫ్ సభ్యులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు [illegible] సెక్రటరీ అయిన జాన్ దానియేల్ [illegible] యావన్మందికి తెలియజేయునది ఏమనగా !

ఈ దిగువ షెడ్యూల్‌లోని దాఖలా స్థిరాస్తిని నా క్లయింట్ పశ్చిమగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, నల్లజర్ల, Z.P.High School D.No.3-31 లో నివాసము గల [illegible] గండి [illegible] @ [illegible] గండి, పాస్టర్ Age 58 [illegible] తాడేపల్లిగూడెం మండలం, తాడేపల్లిగూడెం గ్రామ [illegible] Late గారి కుమారుడు గండి [illegible] Late గారి పేరున నిడదవోలు, రాయపేట వార్డు [illegible] D.No. 12-8-11 [illegible] 231 1/2 చ.గ. [illegible] నిడదవోలు మండలం, సర్వే నం. 180/3, నిడదవోలు SRO లో [illegible] D.No.2856/2004 లో గల స్థిరాస్తిని విక్రయం [illegible] నా క్లయింట్ క్రయము చేయుటకు అంగీకరించి [illegible]

కావున, ఈ క్రయ,విక్రయములకు ఎవరైన ఏవిధమైన అభ్యంతరములు [illegible] ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 దినములలో నాకు గాని, నా క్లయింట్‌గాని వ్రాతపూర్వకముగా, పూర్తి ఆధారములతో తెలియజేయగలరు. [illegible]

షెడ్యూల్ వివరములు :-

తూర్పు : [illegible] 60.0లు [illegible], దక్షిణం : [illegible] 43.6లు [illegible] : [illegible] 56.0 [illegible] ఉత్తరము : [illegible] 28.4 [illegible] మున్సిపల్ రోడ్డు

కోటి రాజా వర్ధనరావు MA.LLB
అడ్వకేటు
[illegible], విజయనగరం
సెల్ : 84404 84288, 81107 87242

మానవత సేవలు అభినందనీయం



పెంటపాడులో కేక్ కట్ చేస్తున్న మానవత సభ్యులు

పెంటపాడు: మానవత సేవలు అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ ముగింపు పురస్కరించుకొని మానవత ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా మానవత అధ్యక్షుడు మోహనరావు మాట్లాడుతూ దివ్యాంగులను ఆదరిస్తే ఎన్నో విజయాలు సాధిస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈడీ ఉపాధ్యాయిని షేక్ మస్తాన్ బీ, వి సునీత సీఆర్‌పీలు చిట్టెమ్మ, రాజు, బాలు, వాసు తదితరులు పాల్గొన్నారు.

కంతేరు ఉప సర్పంచ్ మృతి

ఇరగవరం: ఇరగవరం మండలం కంతేరు ఉప సర్పంచ్ కడలి త్రిమూర్తులు(60) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య రామసీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సర్పంచ్ ఆదిలక్ష్మి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ బోర్డు సభ్యులు, నాయకులు గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలి



ఆరుళ్ల గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు తమ జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట భీమశంకరరావు (తాతాజీ) అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరుళ్ళ, నవాబుపాలెం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఆరుళ్లలో జరిగిన సభకు సర్పంచ్ మాకరాజు వరలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటలెక్చువల్ సెల్ కార్యదర్శి చిట్యాల రాంబాబు, ఓబీసీ నాయకులు ఇమ్మంది బెనర్జీ, మారిశెట్టి నరసింహమూర్తి, మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాస రాజు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పాల్గొన్నారు.

నీటమునిగిన వరి చేలు



తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను గ్రామంలో వర్షపు నీటిలో వరి కంకులు

తాడేపల్లిగూడెం రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో తాడేపల్లిగూడెం మండలంలోని ఆరుగొలను గ్రామంలో వర్షపు నీటిలో మునిగిన వరి చేలు తెప్పరిల్లుతున్నాయి. గోదావరి ఏలూరు కాలువలో నీటి ప్రవాహాన్ని తగ్గించడంతో వరి చేలలోని నీరు కాలువలోకి మళ్లించారు. దీంతో త్వరితగతిన నీరు లాగిందని రైతులు పేర్కొంటున్నారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు గోదావరి ఏలూరు కాలువకు నీటి ప్రవాహాన్ని తగ్గించడంతో రైతులు త్వరితగతిన ముంపు బారి నుంచి గట్టెక్కారని చెప్పవచ్చు. రెండ్రోజుల వ్యవధిలోనే చేలలోని నీరు లాగడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.